# మగాడి పెళ్ళి సమస్యేనా?

"పిన్నిగారూ! ఏమయిందీ మొన్న చూసిన సంబంధం? పిల్ల నచ్చిందా? ఖాయమైనట్టేనా?" ప్రశ్నమీద ప్రశ్న వేసి అడుగుతోంది కృష్ణవేణమ్మ పక్కింటి సుగుణమణిగారిని?

"పిల్ల బాగుంది. మా అందరికీ చూడగానే నచ్చింది"

"మీ వాడికీ?"

"వాడికీ నచ్చింది?"

"ఏం చదువుకుందేమిటి?"

"ఎమ్.ఎస్.సి. ఫస్ట్‌క్లాస్‌లో పాసైందిట. సి.ఎ. చేస్తోందిట!"

"ఇంకేం? తెలివైనపిల్ల! సి.ఎ చేస్తోందంటే సామాన్యమా! అయినా మనబ్బాయి కూడా ఎమ్.ఎ., ఎల్.ఎల్.బి చేశాడుగా, అంతా బాగానే వుంది. కుదిరిపోక ఏమవుతుంది?" అంది సంతోషంగా కృష్ణవేణమ్మ!

"కానీ కుదరలేదు!"

"ఏమీ? కట్నాల దగ్గరేమన్నా కుదరలేదా? పిల్ల బాగానే చదువుకున్నాది కనక పోనీ కట్నం తక్కువడగండి"

"అసలు మేము కట్నమే వద్దన్నాం!"

"మరి ఇంకేమిటండీ?"

"ఆ అమ్మాయికి ఆ అభిలాష్ నచ్చలేదుట!"

"ఏమిటీ అమ్మాయికి నచ్చలేదా? వాళ్ళవాళ్ళకి నచ్చలేదా?"

"వాళ్ళందరూ ఒప్పుకున్నారు. కానీ పిల్లమాత్రం నాకు నచ్చలేదు, నేను చేసుకోను అంటోందిట! పిల్లాడు నల్లగా ఉన్నాడనీ, పాత కాలపువాడిలా డ్రెస్ చేసుకున్నాడనీ ఏవేవో అందిట!"

"మీకెవరు చెప్పారూ?"

"మా అన్నయ్య కూతురు శిరీష చెప్పింది. అదీ, ఈ పెళ్ళికూతురూ శరణ్యా బి.ఎస్.సిలో క్లాస్‌మేట్స్! తనతో చెప్పిందట!

ముక్కుమీద వేలేసుకుని నోరు తెరిచింది కృష్ణవేణమ్మ. ఆశ్చర్యంలోంచి తేరుకోలేక!

"ఏమిటి అలా అయిపోయారు?" అడిగింది సుగుణమణి.

"ఎంత చదువుకుంటే మాత్రం ఆడపిల్ల ఆడపిల్లేకదా? నాకీ పిల్లాడు నచ్చలేదూ అని ఎలా చెప్పేసింది! అయినా మన అభిలాష్‌కి ఏమైందనీ?"

"అభిలాష్ పాతకాలంవాడిలాగా వున్నాడు. మోడరన్‌గా లేకుండా! పైగా నల్లగా వున్నాడట!"

"బాగుంది!, తను తెల్లగా వుందా?"

"అవును!"

"అయినా రంగూగింగూ కొరుక్కుతింటాంటండీ! పిల్లాడు బుద్ధిమంతుడా కాదా చూడాలికానీ ఈ బాహ్యరూపం గురించి గొడవ పడడమేమిటి? అయినా మొగాడికి అందమేమిటండీ?

"ఆ రోజులు పోయాయమ్మా! పోవాలికూడా? ఆడపిల్లా ఒక మనిషే! ఆమెకీ కొన్ని అనుభూతులూ, ఆదర్శాలూ వుంటాయి. నిర్మొహమాటంగా తన అభిప్రాయాలను వెల్లడిచేసి తనకి నచ్చిన వ్యక్తితో జీవితాన్ని పంచుకోవాలనుకోవడంలో తప్పేముంది? మన పూర్వీకులు స్త్రీకి అలా ఆమె తన అభిప్రాయాన్ని తన కాబోయే జీవిత భాగస్వామిని గురించి చెప్పే అవకాశం

ఇవ్వకుండా, ఆమె ఆమోదం కోసం ఆగకుండా పెద్దలమంటూ కన్నవారూ, చుట్టూ ఉన్నవారూ కలిసి ఆమె తరపున నిర్ణయాలు తీసుకునేవారు. ఆ రోజుల్లో ఆడపిల్ల తనకి అన్యాయం జరిగితే ఖర్మ అనీ, న్యాయం జరిగితే అదృష్టమనీ భావించింది. ఈ రోజున పిల్లలు అలా వారి జీవితాలలో నిర్ణయాలని పెద్దలకి వొదిలేయడం లేదు. వాళ్ళ నిర్ణయాలు వాళ్ళే తీసుకుంటున్నారు. నిజంగా ఇది అభినందించవలసిన విషయం.

"సుగుణమణిగారూ! అలా అయితే మొగపిల్లాడి పెళ్ళి ఒక సమస్యగానే తయారవుతుంది" అంది కృష్ణవేణమ్మ భయంగా! (ఆమెకి ముగ్గురు కొడుకులు లెండి!)

"అవును! పెళ్ళి ఎవరికీ నిజంగా సమస్య కాకూడదు. ఒకవేళ అది సమస్యే అయితే అది ఒక్క ఆడదాని సమస్యే ఎందుకు కావాలి? మగవాడిగా పుట్టినంత మాత్రాన, ఏ షంకా పెట్టకుండా ఆడపిల్ల తాళి కట్టించేసుకుని పడుండాలా? ఎందుకీ భేదం? ఎందుకీ పక్షపాతం? పెళ్ళి స్త్రీ పురుషులిద్దరూ ఆనందంతో కలుసుకుని జీవితాన్ని పంచుకుని, ఏక లక్ష్యంతో ఒకే బాటలో నడిచే మధురాతి మధురమైన ఘట్టం!

జీవితాంతం కలిసుండి ఇద్దరూ ఒకటై, పిల్లాపాపలతో గడిపే నందనవనం కావాలి! జీవితం సర్దుబాటుగా వుండకూడదు. కమ్మని కలలు కూడలి కావాలి! మొగపిల్లాణ్ణి, ఆడపిల్లనీ కూడా కన్నతల్లిగా ముఖ్యంగా ఒక స్త్రీగా చెబుతున్నాను. శరణ్య తన అభిప్రాయాన్ని అంత నిర్మొహమాటంగా చెప్పడం ఆమె వ్యక్తిత్వాన్ని చాటుతుంది. ఆ అమ్మాయిని నా బిడ్డలాగా అభినందిస్తున్నాను. మనసారా ఆశీర్వదిస్తున్నాను" అంది.

కృష్ణవేణమ్మ తనకి జ్ఞానోదయమైనట్టు, "బాగా చెప్పేరు పిన్నిగారూ! వాడికేం! మొగమహారాజు! అనే గర్వం మొగపిల్లల తల్లిదండ్రులకీ 'నేను మగాణ్ని! ఎలావున్నా పెళ్ళవుతుంది!' అనే ధీమా పెళ్ళి కొడుకులకీ ఈ దెబ్బతో పోతుంది" అంది. ★